క్లుప్తంగా

శాస్త్రీయ విద్యా విధానం రావాలి



జిల్లా విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతుల కార్యక్రమంలో మాట్లాడుతున్న వర్మ

కాకినాడ సిటీ: ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో యూటీఎఫ్ హోమ్‌లో నిర్వహించే జిల్లా విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతులను శుక్రవారం జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు ప్రారంభించారు. శాస్త్రీయ దృక్పథం, సమాజ పరిణామ క్రమాన్ని జేవీవీ జిల్లా కార్యదర్శి జీఎస్ హెచ్‌పీ వర్మ బోధించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంజయ్, నాయకులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా చెల్లూరి



సత్యనారాయణను సత్కరిస్తున్న సంఘ సభ్యులు

బోట్‌క్లబ్: కాకినాడ అర్బన్, రూరల్ విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘ ఎన్నికలు స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘ కార్యాలయంలో శుక్రవారం జరిగాయి. పుట్టా భాస్కరరావు అధ్యక్షతన జరిగిన ఈ ఎన్నికల్లో చెల్లూరి సత్యనారాయణ, పి.జయకృష్ణ అధ్యక్ష బరిలో పోటీ పడ్డారు. సత్యనారాయణకు 20 ఓట్లు, జయకృష్ణకు 5 ఓట్లు పడడంతో సంఘ అధ్యక్షుడిగా చెల్లూరి సత్యనారాయణ విజయం సాధించారు. సంఘ ప్రధాన కార్యదర్శిగా పుట్టా భాస్కరరావు ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు. అనంతరం సభ్యులు అధ్యక్షుడు సత్యనారాయణను సత్కరించారు.

ప్రపంచంలో భారత్ స్థానం సుస్థిరం

బోట్‌క్లబ్: ప్రపంచంలో భారతదేశానికి సుస్థిర స్థానం సంపాదించిందంటే దానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన కృషేనని బీజేపీ కాకినాడ అసెంబ్లీ కన్వీనర్ గట్టి సత్యనారాయణ అన్నారు. స్థానిక జగన్నాథపురానికి చెందిన సాకా వేంకటశ్వర్లు వారి మిత్ర బృందం శుక్రవారం బీజేపీలో చేరారు. వారికి బీజేపీ నగర మాజీ అధ్యక్షులు పైడా భవనప్రసాద్, గట్టి సత్యనారాయణ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ నాయకులు మొసలగంటి సురేష్, గొతు చిన్న, అనిల్ పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ



పేద ముస్లింలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న మత పెద్దలు

కాకినాడ: రంజాన్ సందర్భంగా జామియా మసీదు ఆధ్వర్యంలో పేద ముస్లింలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మెయిన్‌రోడ్డులోని మసీదు ఆవరణలో మసీదు అధ్యక్షుడు ఎస్.ఇజాజుద్దీన్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. తొలుత మసీదు ఇమామ్ రజాక్ రిజ్వీ పాల్గొని దువా చేశారు. సుమారు 350 మందికి నిత్యావసర కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఇజాజుద్దీన్ మాట్లాడుతూ రంజాన్ సందర్భంగా పేదలు కూడా రంజాన్‌ను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, ముస్లిం ప్రముఖులు షేక్ మొహిద్దీన్, దీన్, అబ్బాస్, అజ్జు, అలీఖాన్, షమ్ము, ఇక్బాల్, కిద్‌మత్ కమిటీ సభ్యులు షేక్ చిష్టి, హుస్సేన్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు సందేశం మానవాళికి అవసరం

- జిల్లా పాస్టర్ల ఫెలోషిప్ అధ్యక్షుడు దొమ్మేటి
- భక్తిశ్రద్ధలతో చర్చిల్లో ప్రార్థనలు



గుడ్ ఫ్రైడే సందర్భంగా పండూరులో నిర్వహిస్తున్న శిలువ యాత్ర

కాకినాడ సిటీ: క్షమాగుణం, పొరుగువానిపై ప్రేమ, బాధ్యతగా వ్యవహించడం వంటి క్రీస్తు సందేశాలు మానవాళికి అనుసరణీయంగా ఉన్నాయని జిల్లా పాస్టర్ల ఫెలోషిప్ అధ్యక్షుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్ అన్నారు. శుక్రవారం తూరంగి బైపాస్ రోడ్డులో నిర్వహించిన గుడ్‌ఫ్రైడే ప్రార్థన కార్యక్రమంలో భాగంగా క్రైస్తవులనుద్దేశించి మాట్లాడారు. పాపం చేసిన వారిని శిక్షించడం కంటే మనిషిలోని పాపాన్ని శిలువ వేయాలనేదే గుడ్ ఫ్రైడే సందేశం అన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా గుడ్‌ఫ్రైడే జరుపుకొంటారన్నారు. శిలువపై క్రీస్తు పొందిన త్యాగపూరితమైన మరణాన్ని స్మరించుకుంటూ, కోరికలను అణచుకుంటూ, పాపాల నుంచి క్షమాపణ కోరుకుంటూ ప్రార్థన, ప్రాయశ్చిత్తం కోసం క్రైస్తవులు నలభై రోజుల పాటు భక్తిశ్రద్ధలతో చేపట్టిన ఉపవాస దీక్షలు శుభ శుక్రవారంతో ముగించారు.

నలభై రోజుల పాటు అనుక్షణం క్రీస్తును ధ్యానించాం, యేసయ్య శిలువ ద్వారా మానవాళికి ఇచ్చిన సందేశం నేటి సమాజంలోని ప్రతి మనిషికి మార్గదర్శనం చేస్తుందని శామ్యూల్‌సాగర్ అన్నారు. క్రైస్తవులు, ప్రజలు చర్చిలకు వెళ్లి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత పెద్దలు బిషప్ దొమ్మేటి వసంతరావు, ప్రియాసాగర్ క్రీస్తు సందేశాన్ని వివరించారు.

31న ఈస్టర్..

గుడ్‌ఫ్రైడే రోజు శిలువపై అశువులు బాసిన క్రీస్తు మూడో రోజు తెల్లవారుజామున సమాధి నుంచి దర్శనమిచ్చాడని క్రైస్తవులు విశ్వసిస్తారు. దీనినే క్రైస్తవులు ఈస్టర్ (పునరుత్థాన పండుగ)గా జరుపుకుంటారని శామ్యూల్ సాగర్ తెలిపారు. ఈస్టర్ జరుపుకునేందుకు ఆదివారం తెల్లవారుజామున చర్చిల్లో శిలువను ఏర్పాటు చేయనున్నారు. చుట్టూ కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక గీతాలతో ఆరాధిస్తూ ప్రార్థన చేయనున్నట్లు తెలిపారు. నూతన వస్త్రాలు ధరించి, ప్రత్యేక వంటకాలు తయారు చేసుకుంటారని, క్రైస్తవులంతా తమ స్నేహితులు, మిత్రులు, బంధువర్గాలతో పాటు చర్చిల్లో విశ్వాసులకు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొంటారన్నారు. జీవన యానంలో తల్లిదండ్రులకు గౌరవం ఇవ్వాలని, సంతానం పట్ల దయాగుణం, సన్మార్గంలో జీవిస్తూ చీకట్లో ఉన్నవారికి చేయూత నివ్వాలనేదే క్రీస్తు సందేశమన్నారు. ఇవి అందరూ ఆచరించదగినవి.

పండూరులో శిలువ యాత్ర

కాకినాడ రూరల్: గుడ్ ఫ్రైడే సందర్భంగా మండలంలోని పండూరు గ్రామంలో జాన్సన్ మినిస్ట్రీస్ పెంతుకోస్తు సంఘం పాస్టర్ కె.రవి జయంత్ కుమార్, యూత్ సభ్యులు, సంఘస్తుల ఆధ్వర్యంలో శిలువ యాత్ర ఘనంగా నిర్వహించారు. శిలువపై ఏసుక్రీస్తును ఏ విధంగా చిత్ర హింసలకు గురిచేశారో యాత్ర ద్వారా ప్రదర్శించారు. అధిక సంఖ్యలో క్రైస్తవులు యాత్రలో పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

కాకినాడ రూరల్: గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలోని వృద్ధులకు అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టరు సువర్ణరాజు మాట్లాడుతూ క్రీస్తు త్యాగాలకు ప్రతీక అని, మానవాళిని పాపాల నుంచి రక్షించడానికి ప్రభువైన ఏసుక్రీస్తు తన ప్రాణాలను అర్పించిన దిన శుభ శుక్రవారం ఎంతో పవిత్రంగా భావిస్తారన్నారు. అడబాల ట్రస్ట్ చైర్మన్ రత్న ప్రసాద్ గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని ఎ.రామ్మూరి సహకారంతో వృద్ధులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మాధవీలత, యనమల రామం, చింతపల్లి సుబ్బారావు, డీఆర్ శ్రీవత్సవ, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

పలు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): నగరంలో గుడ్ ఫ్రైడేను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. . కల్వరి గిరి కొండమీద క్రీస్తు మరణాన్ని గుర్తు చేసుకుంటూ క్రైస్తవులు గుడ్‌ఫ్రైడే ఆచరించారు. నగరంలో అర్బన్ ఎంఆర్ఓ భవన్ సమీపంలోని క్రేగ్ మెమోరియల్ బాప్టిస్టు చర్చి, రామారావు పేటలోని సెయింట్ లూథరన్ చర్చి, గాంధీనగర్‌లోని హౌస్ ఆఫ్ ప్రేయర్, ఆంధ్రా బాప్టిస్టు చర్చి, జగన్నాథపురంలోని సెంటినరీ బాప్టిస్టు చర్చి, రోమన్ కేథలిక్ చర్చి, చీడీల పోర లోని షాలోమ్ ప్రేయర్ హౌస్, రిజర్వ్ లైన్స్ పోలీస్ క్వార్టర్స్ బాప్టిస్టు చర్చి, ఏపీఎస్పీ యూనియన్ బాప్టిస్టు చర్చి, పీస్ మేకర్స్ మినిస్ట్రీస్ చర్చి ఆధ్వర్యంలో, క్రేగ్ ఇమ్మానుయేల్ చర్చిలలో గుడ్‌ఫ్రైడేను ఘనంగా నిర్వహించారు. నగర వీధుల్లో యేసు శిలువ మరణ సన్నివేశాలు ప్రదర్శించారు. క్రేగ్ మెమోరియల్ బాప్టిస్టు చర్చి పాస్టర్ రెవరెండ్ డి.వరప్రసాద్, సంఘ నాయకులు డానియేల్ దినకర్ జాసన్, యమ్.వినోద్ కుమార్, కె.రంజిత్‌కుమార్, రిజర్వు లైన్స్ పోలీస్ యూనియర్ చర్చి పాస్టర్ ఎం.చంద్రపాల్, హౌస్ ఆఫ్ ప్రేయర్‌లో పాస్టర్ విజయ్‌కుమార్, మోజెస్, గాంధీనగర్ తెలుగు బాప్టిస్టు చర్చిలో పాస్టర్ బీవీ రాజు, బెరాకా బెస్సింగ్స్ చర్చిలో పాస్టర్ జోసఫ్‌బెన్ని, షాలేమ్ ప్రేయర్ హౌస్‌లో పాస్టర్ శామ్యూల్ విక్టర్, రేస్ ఆఫ్ పీస్ చర్చిలో పాస్టర్ మూర్తిరాజు, రామారావు పేట లూథరన్ చర్చిలో శామ్యూల్‌రాజు, గొల్లపేటలోని పీస్ మేకర్స్ మినిస్ట్రీస్ పాస్టర్ జోసఫ్ ప్రత్యేక గుడ్‌ఫ్రైడే సందేశాలను అందించారు. పెద్ద సంఖ్యలో క్రైస్తవులు ఈ ప్రార్థనల్లో పాల్గొన్నారు.



వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న అడబాల ట్రస్ట్ సభ్యులు



గాంధీనగర్ తెలుగు బాప్టిస్టు చర్చిలో ప్రత్యేక గీతాలు ఆలపిస్తున్న సభ్యులు



గాంధీనగర్ షాలేమ్ ప్రేయర్ హౌస్‌లో పాల్గొన్న క్రైస్తవులు

క్రీస్తు బోధనలు అనుసరించాలి

ఎమ్మెల్యే ద్వారంపూడి



ఎమ్మెల్యే ద్వారంపూడికి శుభం కలగాలని ప్రార్థన చేస్తున్న పాస్టర్ విజయ్‌కుమార్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): స్థానిక గాంధీనగర్ హౌస్ ఆఫ్ ప్రేయర్ చర్చిలో శుక్రవారం ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు. చర్చి పాస్టర్ విజయ్‌కుమార్, మోజెస్ ఆయన కోసం ప్రత్యేక ప్రార్థనలు చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ క్రీస్తు సిలువ మరణం పొందిన రోజు చాలా పవిత్రమైనదని అన్నారు. క్రీస్తు బోధనలు అనుసరించి ప్రతీ ఒక్కరు నీతి, నిజాయితీ, ప్రేమ కలిగి జీవించాలన్నారు. పేదలకు, ఆపదలో ఉన్న వారికి తగిన సహాయం చేయాలని సూచించారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులకు ఎమ్మెల్యే ద్వారంపూడి గుడ్‌ఫ్రైడే శుభాకాంక్షలు తెలిపారు.

జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు



ఎమ్మెల్యే కన్నబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన జనసేన కార్యకర్తలు

- పార్టీ కండువాలు వేసి స్వాగతించిన ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: మండలంలోని వలసపాకల గ్రామం నుంచి వైఎస్సార్ సీపీలోకి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమక్షంలో జనసేన కార్యకర్తలు శుక్రవారం భారీగా చేరారు. వలసపాకల గంగరాజు నగర్ రోడ్డు నంబరు 1లో వైఎస్సార్ సీపీ నాయకురాలు మాకినీడి శేషుకుమారి ఆధ్వర్యంలో జనసేన నుంచి కట్టా జహన్‌మోహన్ కిశోర్ వర్మ, కె.మణికంఠ, పసుపులేటి సాయికుమార్, పి.ప్రణీత్ కుమార్, పెమ్మాడి ప్రసాద్, మల్లాడి వేణు, చిల్లే గోవిందరాజులు, సిర్లి అన్నపూర్ణ, భవాని, చామంతుల దేవి, పెండ్యాల ఏసురత్నం తదితరులు సుమారు 200 మంది చేరారు. వీరికి పార్టీ కండువాలు వేసిన ఎమ్మెల్యే కురసాల కన్నబాబు వైఎస్సార్ సీపీలోకి స్వాగతించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పెద్ద ఎత్తున టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరుతున్న వారందరికీ సముచిత స్థానం ఇస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే ద్వారంపూడి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: కాకినాడ రామకృష్ణారావుపేటలోని కొత్తూరు మసీదులో శుక్రవారం సాయంత్రం జరిగిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు. అక్కడకు వచ్చిన ముస్లింలకు ఆయన రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. మసీదు అధ్యక్షుడు పి.కుత్బుద్దీన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, జిల్లా వక్ఫ్ బోర్డ్ అధ్యక్షుడు రహమాన్ ఖాన్, జిల్లా వైఎస్సార్ సీపీ మైనార్టీల అధ్యక్షుడు బాషా నగర మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖాలిద్ బిన్ వలి, మాజీ కార్పొరేటర్ రోకళ్ల సత్యనారాయణ, పెద్ద సంఖ్యలో ముస్లింలు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ ముస్లింలు రంజాన్ పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

అభివృద్ధి చేశా.. మళ్లీ ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- 32వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం



రామకృష్ణారావుపేటలో ప్రజలను ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: గడచిన 35 ఏళ్లలో ఎన్నడూలేనంతగా రామకృష్ణారావుపేట ప్రాంతాన్ని అభివృద్ధి చేశాను. రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆ ప్రాంత ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆయన 32వ డివిజన్ రామకృష్ణారావుపేట ప్రాంతంలోని నీలాపువారివీధి, మునగాలవారివీధి, గాబువారివీధి, జెండా వీధి, మసీదు ప్రాంతాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడిచిన ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మున్నెన్నడూ లేనంతగా రామకృష్ణారావుపేట ప్రాంతంలో విశాలమైన రహదారులు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించామని, ఎన్నో సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా అందించామని ప్రజలకు వివరించారు. వైనాట్ 175 నినాదంలో భాగంగా కాకినాడ నుంచి తొలి విజయాన్ని అందించాలన్నది తన లక్ష్యమన్నారు. కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ రోకళ్ల సత్యనారాయణ, స్థానిక నాయకులు కొప్పుల సుజాత, కొయ్యా రమణ, దళాయి వేణు, బాదం చిన్న, నీలాపు సంజీవ్‌తో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

భర్త విజయం కోసం సహధర్మచారిణి

రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసి కాకినాడ నగరాన్ని ఎంతో అభివృద్ధి చేసిన ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిని మూడోసారి గెలిపించాలని ఆయన సహధర్మచారిణి మహాలక్ష్మి శుక్రవారం ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. 38వ డివిజన్ పరిధిలోని ఎల్విన్‌పేట, శెట్టిబలిజపేట, గొల్లవారివీధి ప్రాంతాల్లో ఆమె పెద్ద ఎత్తున మహిళా కార్యకర్తలు, నాయకులతో ప్రచారం చేశారు. నిరంతరం ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పరితపించిన ద్వారంపూడికి మరో విజయాన్ని అందించాలంటూ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఆయా ప్రాంతాల్లో తమ అభివృద్ధికి ఎంతో శ్రమించిన ద్వారంపూడిని మరోసారి గెలిపించుకుంటామని ప్రజలు హామీ ఇచ్చారు. మహాలక్ష్మి మాట్లాడుతూ సీఎంగా జగన్‌తో పాటు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు చలమలశెట్టి, ద్వారంపూడి విజయానికి ప్రజలంతా తోడ్పడాలని కోరారు. ఆమె వెంట ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, ఐటీ సెల్ చైర్మన్ కృష్ణప్రియ, మహిళా నాయకురాలు మీసాల రామతులసితో పాటు పెద్ద సంఖ్యలో మహిళా నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.



రామకృష్ణారావుపేట ప్రాంతంలో విజయం మీదే అని ఎమ్మెల్యే ద్వారంపూడికి భరోసా ఇస్తున్న మహిళ



ద్వారంపూడిని గెలిపించాలని అభ్యర్థిస్తున్న ఆయన సతీమణి మహాలక్ష్మి

కలెక్టర్‌కు సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు





కలెక్టర్ కృతికా శుక్లాకు జ్ఞాపిక అందజేస్తున్న జెడ్పీ సీఈవో శ్రీరామచంద్రమూర్తి, జిల్లా అధికారులు, నగరపాలక సంస్థ ఉద్యోగులు

కాకినాడ సిటీ: ప్రసూతి సెలవుపై వెళ్తున్న కలెక్టర్ కృతికా శుక్లాను పలువురు అధికారులు శుక్రవారం సత్కరించి వీడ్కోలు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జిల్లాల పునర్విభజనలో భాగంగా ఏర్పడిన కాకినాడ జిల్లాకు తొలి కలెక్టర్‌గా డాక్టర్ కృతికా శుక్లా సుమారు రెండు సంవత్సరాల పాటు దూరదృష్టితో మంచి న్యాయకత్వ లక్షణంతో, మానవత, సానుకూల దృక్పథంతో ఉత్తమ సేవలు అందించారని కొనియాడారు. ఈ వీడ్కోలు సభకు ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్, అటవీశాఖ అధికారి కె.భరణి, జెడ్పీ సీఈవో ఎ.శ్రీరామచంద్రమూర్తి, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు సూర్యప్రకాశరావు, బి.లక్ష్మీనారాయణ, ఆర్డీవోలు ఇట్ల కిషోర్, జె.సీతారామారావు, రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు పి.త్రినాథ్, కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొని వీడ్కోలు పలికారు.

మున్సిపల్ ఉద్యోగుల వీడ్కోలు

ప్రసూతి సెలవుపై వెళ్తున్న కాకినాడ నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాను శుక్రవారం రాత్రి నగరపాలక సంస్థ అధికారులు జె.వెంకటరావు ఆధ్వర్యంలో వివిధ విభాగాధిపతులు మర్యాదపూర్వకంగా కలిసి వీడ్కోలు పలికారు. కలెక్టర్ కృతికా శుక్లాను జె.వెంకటరావు, అదనపు కమిషనర్ నాగనరసింహరావు, ఇతర అధికారులు జ్ఞాపికను అందజేసి సత్కరించారు. కలెక్టర్ కృతికా శుక్లాను సత్కరించిన వారిలో మున్సిపల్ ఉద్యోగులు పి.సత్యకుమార్, ఎం.ఏసుబాబు, గుంటూరు శేఖర్, డాక్టర్ పృథ్వీచరణ్, హరిదాస్, నాగశాస్త్రులు తదితరులు ఉన్నారు.

భవిత బంగారమాయె

- దివ్యాంగ విద్యార్థులకు వరం
- ఉచితంగా ఫిజియోథెరపీ సేవలు



పెద్దాపురం భవిత కేంద్రంలో ఫిజియోథెరపీని పరిశీలిస్తున్న ఎంఈఓలు (ఫైల్)

పెద్దాపురం: శారీరకంగా, మానసికంగా పుట్టుకతోనే ఏదో లోపంతో జన్మించిన విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన భవిత కేంద్రం ఎంతో ఆసరాగా నిలుస్తోంది. చీకటిలో ఉన్న వారి భవితను బంగారుమయం చేస్తోంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలు వారికి ఎంతగానో తోడ్పాడునందిస్తున్నాయి. విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటు అందరితో సమానంగా జీవించేలా భవిత కేంద్రాలు భరోసానిస్తున్నాయి.

శిక్షణ ఇలా..

నియోజకవర్గ పరిధిలోని పెద్దాపురం, సామర్లకోట మండల కేంద్రాల్లో ప్రభుత్వం భవిత కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇక్కడ రెండు కేంద్రాల్లో ప్రత్యేక అవరాలు కల్గిన సుమారు 30 మంది చిన్నారులకు సోమవారం నుంచి శుక్రవారం వరకు ఫిజియోథెరపీలో శిక్షణ ఇస్తున్నారు. మందబుద్ధి, దృష్టి, వినికిడి లోపాలు కల్గిన విద్యార్థులకు స్పీచ్ థెరపీ, బ్రెయిలీలిపిలో శిక్షణతో జీవితం అందిపుచ్చుకునేలా శిక్షణ ఇస్తున్నారు. ప్రతి గురువారం ప్రత్యేక ఫిజియోథెరపీ శిక్షణ ఇస్తున్నారు. అడుగు తీసి అడుగు వెయ్యలేని చిన్నారులందరికీ నడక నేర్పిస్తున్నారు. ఐఈఆర్‌పీ (ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్‌పర్సన్)లను చిన్నారుల ఇంటికి వెళ్లి ఫిజియోథెరపీ చేసేలా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మాటలు రాని వారికి స్పీచ్ థెరపీ ద్వారా శిక్షణ ఇచ్చి మాటలు వచ్చేలా చేస్తుండడంతో భవిత సేవలపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రాయితీలు..

భవిత కేంద్రాలకు వచ్చే విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం పలు రాయితీలు అమలు చేస్తోంది. భవిత కేంద్రానికి వచ్చేందుకు రావాణా ఖర్చుల కింద ప్రతి నెలా రూ.300 ఇస్తోంది. వారికి భద్రతగా వచ్చే తల్లిదండ్రులకు రూ.250 చొప్పున రాయితీ అందిస్తోంది. వారికి అవసరమైన పరికరాలు, ఆట వస్తువులను ఉచితంగా అందజేస్తోంది. వారికి మధ్యాహ్న భోజనం, దుస్తులు, వినికిడి యంత్రాలు, వీల్ చైర్లు తదితర వస్తువులను ప్రభుత్వమే సమకూరుస్తోంది. అవపరమైన చిన్నారులకు శస్త్ర చికిత్సలను చేయిస్తున్నారు.

చాలా వరకు నయమైంది



మా అబ్బాయి జగదీష్ పుట్టుక నుంచే బధిరుడు. భవిత కేంద్రంలో స్పీచ్, ఫిజియోథెరపీ చేయించాం. అలా చేయడం వల్ల చాలా వరకు నయమైంది. గత నాలుగేళ్లు భవిత సేవలను వినియోగించుకుంటున్నాం.

– పల్ల లలిత, విద్యార్థి తల్లి, కట్టమూరు, పెద్దాపురం మండలం

విభిన్న ప్రతిభావంతుల్లో మార్పే లక్ష్యం



విభిన్న ప్రతిభావంతుల్లో మార్పే లక్ష్యంగా పని చేస్తున్నాం. సాటి విద్యార్థుల్లా వారు కూడ ఉండాలని శిక్షణ ఇస్తున్నాం. వారి మానసిక పరిస్థితిని అంచనా వేసి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థుల తల్లిదండ్రులు భవిత సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– బి.దుర్గాప్రసాద్‌రెడ్డి, ఐఈఆర్‌టీ ఉపాధ్యాయుడు, పెద్దాపురం

1000 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

పిఠాపురం: కొత్తపల్లి మండలం పొన్నాడ శివారు కోనపాపపేట తీర ప్రాంతంలో సారా బట్టీలపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. ట్రైనీ డీఎస్పీ ప్రమోద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 1000 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశారు. 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు కొత్తపల్లి ఎస్సై స్వామినాయుడు తెలిపారు. సారా తయారీ దారులు పరారీలో ఉన్నారని చెప్పారు. ఈ సందర్భంగా ట్రైనీ డీఎస్పీ ప్రమోద్ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో సారా తయారీపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. సారా తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఎక్కడైనా సారా తయారు చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీహోమం

తొండంగి: అన్నవరంలోని రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండలో హోమ ద్రవ్యాలను వేసి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో వేద పండితులు, దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.



చండీహోమం నిర్వహిస్తున్న పండితులు